
TGTEL/2026/A1889

# హైదరాబాద్ మిర్రర్

ప్రతి ఉదయం.. జన హృదయం

ఎడిటర్ & పబ్లిషర్ : మాకం గంగాధర్ సంపుటి : 01 సంచిక :67 07 ఆదివారం, జూన్ 2026 వేల : 5/-

Circulation : Hyderabad, Rangareddy, Nalgonda, Yadadri Bhuvanagiri, Suryapet, Mahabubnagar, Khammam, Nizamabad, Sangareddy, Adilabad

సింగరేణిలో భారీ కుంభ కోణం..

02

వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయం..

## బ్లూకలర్ జాబ్స్



02

### సహారా ఎడారిలో

# మృత్యు ఘోష

**నీళ్లు లేక 49మంది మృత్యువాత**

**సహారా,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**

పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచి పోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు.ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు.



### తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు

# ఆరోపణలు

- ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్
- భూదందాలో సీఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు

**హైదరాబాద్,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**

రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు అప్పగిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో చురుకుగా ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి తాము కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా.. పేదల కాలనీల్లో దాడులు చేసి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తోందని మండిపడ్డారు.శ్రీఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారన్నారు. శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు.

### పశ్చిమాసియాలో

# మళ్లీ యుద్ధ మేఘాలు

- ఇరాన్ డ్రోన్లను కూల్చిన
- అమెరికా సైన్యం
- హ్మూజ్ జలసంధి వద్ద
- మళ్లీ ఉద్రిక్తతలు

**టెహ్రాన్,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది.హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది.



### సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు

# అనుకూలం

**మలేషియా ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**

తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మలేషియా కంపెనీలు తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేలా ముందుకు రావాలని సూచించారు. ప్రపంచ స్థాయి 'సెమీ కండక్టర్ ఎకోసిస్టం' అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని వెల్లడించారు. హైదరాబాద్‌ను చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

## అష్టదరిద్రులు అడ్డంపడ్డా

# అభివృద్ధి ఆగదు



- అష్టదరిద్రులు అడ్డంపడ్డా అభివృద్ధి ఆగదు
- ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తాం
- వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం
- వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి
- కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది
- ఇంతకాలం ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం అంటూ ప్రచారం
- అభివృద్ధి నిరోధకంగా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు
- కోహెడ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపనలో సీఎం రేవంత్ రెడ్డి

02

**రంగారెడ్డి,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**

రంగారెడ్డి జిల్లాలోని కోహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్ మనకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానికంగా పండ్ల మార్కెట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. నగరంలోని పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారు. గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని నాడు ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చాను.

# పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యం

**ఆర్థిక సలహా మండలితో ప్రధాని సమావేశం**

**న్యూఢిల్లీ,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**



పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ కీలక భేటీకి అధ్యక్షత వహించారు. శనివారం పీఎం-ఆర్థిక సలహా మండలితో సమావేశయ్యారు. యుద్ధం ముగింపుపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో యుద్ధ ప్రభావాన్ని తగ్గించే చర్యలపై చర్చించినట్లు సమాచారం. ఆర్థికవృద్ధిని బలోపేతం చేయడం, బయటి నుంచి వచ్చే ఒడుదొడుకులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడం, వ్యాపారాలకు మరింత అనువైన వాతావరణాన్ని కల్పించేలా సంస్కరణలు వేగవంతం చేయడం వంటి అంశాలపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది.

# అన్నామలైకి భారీ ఫాలోయింగ్

**వుయ్ ద లీడర్స్' ఉద్యమానికి భారీ మద్దతు**

**ఒక్కరోజులోనే 14 లక్షలమంది ఫాలోవర్లు చేరిక**

**చెన్నై,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**



తమిళనాడు రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై పార్టీకి రాజీనామా చేసిన 24గంటల్లోనే 14లక్షలకు పైగా ప్రజలు ఆయనతో చేరారు. తాను చేపట్టే 'వుయ్ ద లీడర్స్' ఉద్యమంలో చేరాలని కోరుతూ అన్నామలై ఆన్‌లైన్ లింక్ ను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో పెద్దఎత్తున స్పందన వస్తోంది. శుక్రవారం నుంచి శనివారం సాయంత్రానికి 14లక్షలకు పైగా ప్రజలు అందులో చేరారు. ఇంకా సభ్యత్వాలు కొనసాగుతున్నాయి. ఇదే పేరుతో ఆయన 2020లోనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. 2వ పేజీలో


## సత్వరంగా మహిళా సమాఖ్య భవన నిర్మాణాలు

**అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క**

**హైదరాబాద్,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**



మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. 8 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఇవి మహిళల ఆత్మగౌరవ భవనాలని మంత్రి సీతక్క అభివర్ణించారు.పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సర్ అధికారులతో మంత్రి సీతక్క శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. 2వ పేజీలో



## మద్యనిషేధ హామీని

# గాలి కొదిలేసిన జగన్

**సిపిఎస్ రద్దు చేస్తామని మోసం చేసిన వైసిపి**

- జాబ్ క్యాలెండర్ పేరుతోనూ మోసం చేశారు
- టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో భేటీ చంద్రబాబు విమర్శలు

**అమరావతి,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**

మద్యపానం నిషేధం చేస్తామని హామీ ఇచ్చి గొడ్డలి పార్టీ చేతులెత్తేసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. వైసీపీ హయాంలో సీపీఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి ఎందుకు పక్కన పెట్టేసిందని ప్రశ్నించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. 2వ పేజీలో

హైదరాబాద్ మిర్రర్
ప్రతి ఉదయం.. జన హృదయం



07 ఆదివారం, జూన్ 2026

మొదటిపేజీ తరువాయి

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

మొదటిపేజీ తరువాయి

## సహారా ఎడారిలో మృత్యు ఘోష

### నీళ్లు లేక 49మంది మృత్యువాత

**సహారా,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**

పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు. చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.

## తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణలు

### ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

### భూదందాలో సిఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు

**హైదరాబాద్,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**

రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు అప్పగిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో చురుకుగా ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి తాము కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా..పేదల కాలనీల్లో దాడులు చేసి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. శ్రీఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారన్నారు. శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పర సవాళ్లతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు. తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని.. పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పవన్‌కు మద్దతు ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కల్యాణ్ 10 ఎకరాలు శిఖం భూమిని కొనుగోలు చేశారని.. కోడికుంట సర్వే నంబర్ 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని.. ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

మొదటిపేజీ తరువాయి

## సత్వరంగా మహిళా సమాఖ్య భవన నిర్మాణాలు

ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మహిళా భవనాల నిర్మాణ పురోగతిని రోజూ పరిశీలిస్తామని తెలిపారు. ఈ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ఎంపీడీవోలు ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత, పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షించాలని దిశానిర్దేశర చేశారు. ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనుల్లో లక్ష్యాల సాధించాలని అధికారులకు.. మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

మొదటిపేజీ తరువాయి

## అన్నామలైకి భారీ ఫాలోయింగ్

శుక్రవారం అన్నామలై మాట్లాడుతూ.. నైతిక రాజకీయాల కోసం ఏపీజే అబ్దుల్ కలాం కేంద్రాన్ని కోయంబత్తూర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో కొత్త పార్టీ పెట్టనున్నట్లు ప్రకటించారు. ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి మంచి ఉద్దేశంతో నాడు భాజపాలో చేరానని, అదే ఉద్దేశంతో నేడు కొత్త పార్టీ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఒక సామాన్యుడు రాజకీయాల్లోకి రావడం చాలా పెద్ద విషయమని అన్నారు. నేతల దగ్గరకు ప్రజలకు తీసుకువెళ్లడం కాకుండా.. రాజకీయాలనే ప్రజల వద్దకు తీసుకువెళ్లడమే తన ఆలోచన అని పేర్కొన్నారు. సంప్రదాయ, వంశపారంపర్య రాజకీయాలను అంతం చేయడానికి తనతో కలసిరావాలని యువతను కోరారు. వియ్ ది పీపుల్‌ను ప్రారంభించిన ఒక్క రోజులోనే కొత్తగా 14 లక్షల మంది వాలంటీర్లుగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగడమే తన లక్ష్యమని అన్నామలై ఇప్పటికే స్పష్టం చేశారు. సామాన్యుల ప్రయోజనాలే కేంద్రంగా రాజకీయాలు ఉండాలని చెప్పారు. అసలైన మార్పునకు దారితీసే రాజకీయాల అవసరం ఉందని అన్నారు. భవిష్యత్తు తరాలకు గట్టి పునాదులు వేసేందుకు తాను ప్రయత్నిస్తున్నానని చెప్పారు. వ్యక్తి పూజకు, కుటుంబరాజకీయాలకు తావులేదని చెప్పారు. తన ఉద్యమానికి వాలంటీర్లే జీవనాడి అని అన్నారు. కొత్త తరం నాయకులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు, క్షేత్రస్థాయిలో అసలైన మార్పు కోసం వాలంటీర్లు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణం.. ఇలా తమకు నచ్చిన రంగాన్ని వాలంటీర్లు ఎంచుకుని చేతనైన మేరకు తాముంటున్న చోట మేలి మార్పులు తీసుకురావాలని కోరారు. రాబోయే రోజులు మరింత మెరుగ్గా ఉండేలా తాను చేస్తున్న ప్రయత్నాలను చేయూతను ఇవ్వాలని పిలుపునిచ్చారు.

మొదటిపేజీ తరువాయి

## మద్యనిషేధ హామీని గాలి కొదిలేసిన జగన్

ఈ భేటీలో పలు కీలక అంశాలపై దిశినిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తారు. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025పై బురద జల్లుతోందని ఆగ్రహించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో... డీఎస్సీ విషయంలోనూ దుష్ప్రచారంతో లబ్ధిపొందాలనుకున్నారని దుయ్యబట్టారు.డీఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు డిఫెన్సులో పడ్డారని చెప్పుకొచ్చారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్ధాంతమని విమర్శించారు. అధికారంలో ఉన్నామని... సహనం, ఓపిక అవసరమని.. కానీ గొడ్డలి పార్టీ ఆగడాలు శ్రుతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు. మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే సహాయపడతారని అన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకపై టీడీపీకి ఓటమి లేదని, రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో మంచిగా ఉంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు - అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టీడీపీకి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశర చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. మంగళగిరిలో టీడీపీ గెలిచి చాలా కాలమైందని... 2019 ఎన్నికల్లో నారా లోకేశ్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత పట్టుపట్టి పనిచేశారని.. 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసించారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేశ్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టీడీపీకి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత టీడీపీ శ్రేణులదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బీజేపీతో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్రనేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాడ్ మైండ్‌తో ఆలోచించాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు.

## వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయం.. .బ్లూకలర్ జాబ్స్

మొదటిపేజీ తరువాయి

### పరిస్తితులకు అనుగుణంగా యువత్ స్కిల్ అలవర్చుకోవాలి

### జలవనరులను కాపాడేందుకే హైడ్రా ఏర్పాటు

### డ్రగ్స్ నివారణకు ఈగిల్ ఫోర్టస్ ఏర్పాటు-సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**

ఉపాధి విషయంలో.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా రంగాల్లో స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్. యువతరం వాటిపై దృష్టి సారించాలి. అందుకు అవసరమైన స్కిల్స్ పెంచుకోవాలని సీఎం తెలిపారు.జలవనరుల కబ్జాను అడ్డుకునేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నేడు ఎవరైనా చెరువులు, కుంటల వంటివాటి జోలికి వెళ్లాలంటే భయపడుతున్నారని చెప్పారు. బెంగళూరులో ఓ సదస్సులో పాల్గొన్న సీఎం.. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై మాట్లాడారు. ధనికులు విలాస భవనాలు, ఫామ్ హౌస్‌ల కోసం చెరువులను ఆక్రమిస్తున్నారు. అంతేకాకుండా తమ భవనాల వ్యర్థాలను చెరువుల్లో కలుపుతున్నారు. ఈ కబ్జాలను అరికట్టేందుకే సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో 3 వేలమందితో హైడ్రా ఏర్పాటు చేశాం. ఇవాళ ఎవరు ఆక్రమణలకు పాల్పడినా.. ఆ కట్టడాలను నేలమట్టం చేస్తున్నాం. డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే ఉత్తమమైనది. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను దేశమంతా ఆసక్తిగా చూస్తోందన్నారు. తనను మభ్యపెట్టడం అంత ఈజీ కాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పరిపాలనలో కామన్ సెన్స్ అనేదే ముఖ్యమని.. కామన్ సెన్స్‌తో సమస్యలు పరిష్కారం చేసేవే ఎక్కువ అని తెలిపారు. తాను కేసీఆర్ మీడియా పీపుల్స్‌ను కూడా మీడియా సమావేశానికి పిలుస్తానన్నారు. వాళ్ళ మైండ్ సెంట్ ఏంటో తెలుసుకుంటానని చెప్పారు. తనకు వేరే ఏ పని లేదని.. 16 నుంచి 18 గంటలు పని చేస్తానన్నారు.

మొదటిపేజీ తరువాయి

## ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం

పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. తాగేందుకు నీళ్లు ఉండవు.. కూర్చునేందుకు స్థలం ఉండదు. అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నాం. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే.. మనది అంతర్జాతీయ నగరం అవుతుంది. ఎవరెంత ఏడ్చినా.. ఆర్‌ఆర్‌ఆర్ ఆగదు. అభివృద్ధి కూడా ఆగదు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నాం. కాళేశ్వరం కూలేశ్వరం అయినా.. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం. వరి వేస్తే.. ఉరే అని చెప్పిన రోజులు కావు ఇవి. వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళ్లలో కట్టెలు పెట్టినా.. మూసీలో పడి దొర్లినా వాళ్లను పట్టించుకోమని విమర్శించారు. అసూయ పడేవాళ్లు, అజీర్ణం చేసుకునేవాళ్లు ఎప్పుడూ ఉంటారని ఎద్దేవా చేశారు. రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నారు. చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట పండలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం నీళ్లు అనేవారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని రూ.లక్ష కోట్లు వెచ్చిస్తే గోదావరి పాలయ్యాయని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో విధ్వంసం చేస్తే.. మేం వికాసం వైపు నడిపిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసూయ, పగ తమపై చూపండని.. కానీ ప్రజలపై కాదని చెప్పారు. సమస్యలు వస్తే పారిపోమని.. నిలబడి కొట్లాడి పరిష్కరించుకుంటామని అన్నారు. ఫామ్‌హౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా కొట్లాడేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. చేతకాకపోతే దిగిపొమ్మంటున్నారని.. తాము అల్లాటప్పాగా రాలేదని చెప్పారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంగతి చెబుతామని హెచ్చరించారు. మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వమని వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూపి భయపెట్టాలనుకుంటే.. ఇక్కడెవరూ భయపడేవారు లేరని చెప్పుకొచ్చారు ఈనెల 15 తర్వాత వడ్లు కొనకపోతే కేంద్రం సంగతి చూస్తామని హెచ్చరించారు. మాకు మాటలే కాదని.. చేతలు కూడా తెలుసునని అన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తెచ్చుకోవాలో తమకు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోందని వ్యాఖ్యానించారు. భూముల ధరలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడంతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు.ఒకప్పుడు హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండేవని వెల్లడించారు. గడ్డిఅన్నారం నుంచి ఫ్రూట్ మార్కెట్‌ని ఇక్కడికి తరలించారని ప్రస్తావించారు. రేకుల షెడ్లు వేస్తే.. అవి గాలి దుమారానికి ఎగిరిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. పండ్ల మార్కెట్ కోసం మనం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూశారని ధ్వజమెత్తారు. అందరి అవసరాలు తీర్చేలా మార్కెట్ నిర్మాణం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఏటా రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మన ప్రాంతంలో రైతులు అన్ని రకాల పండ్లు పండించాలని ఆకాంక్షించారు. ఫార్మా సిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఇక్కడికి తీసుకురాబోతున్నామని వివరించారు. కాలుష్యం లేని పరిశ్రమలే ఈ ప్రాంతానికి వస్తాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, మార్కెట్, ఆర్‌ఆర్‌ఆర్ వద్దంటూ అడ్డం పడుతున్నారని చెప్పుకొచ్చారు. వరంగల్ ఎయిర్‌పోర్టు వద్దని అడ్డుకుంటోందని ఆగ్రహించారు. గతంలో కావాలని మనం పోరాడితే.. ఇప్పుడు అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేద్దామంటే అడ్డుపడుతున్నారు.. ధర్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 2034 వరకు ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. తమ నినాదమని ఉద్ఘాటించారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఎంతమంది అడ్డం పడినా అభివృద్ధి పనులు ఆగవని తేల్చిచెప్పారు. సదుపాయాలు ఉంటేనే అంతర్జాతీయ స్థాయి నగరం అవుతుందని తెలిపారు. 'కారు' పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉంది. ఎన్ని మరమ్మతులు చేసినా.. చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదు. కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని.. ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోదీ గద్దె దిగాలి. రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తా. పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తా. మెట్రో విస్తరణకు, ఆర్‌ఆర్‌ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తా అని సీఎం అన్నారు.

మొదటిపేజీ తరువాయి

## సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం

### మలేషియా ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జూన్6(హైదరాబాద్ మిర్రర్):**

తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మలేషియా కంపెనీలు తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేలా ముందుకు రావాలని సూచించారు. ప్రపంచ స్థాయి 'సెమీ కండక్టర్ ఎకోసిస్టం' అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని వెల్లడించారు. హైదరాబాద్‌ను చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.సెమీ కండక్టర్, ఏఐ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ వంటి రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్'గా మార్చేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పెనాంగ్‌కు ఉన్న సెమీ కండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ అనుభవం తెలంగాణకు ఉపయోగపడు తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ- మలేషియా మధ్య సాంకేతిక, పెట్టుబడి సహకారాన్ని బలోపేతం చేయాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. మలేషియా ప్రతినిధి వైబీ జగదీప్ సింగ్ దియో తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు.



# కలిసికట్టుగా కృషి చేస్తేనే వార్డుల అభివృద్ధి సాధ్యం






-8,9,10,11,19 వ వార్డులలో ప్రజా అవగాహన-స్వచ్ఛత సమావేశం విజయవంతం

-బహిరంగంగా చెత్త వేస్తే భారీ జరిమానా...

-గంజాయి మత్తు పదార్థాలపై యువత,తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి...

-స్వచ్ఛ చౌటుప్పల్ గా తీర్చిదిద్దుదాం...

-మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్

**చౌటుప్పల్,జూన్ 06, హైదరాబాద్ మిర్రర్ :**

అన్ని వార్డులలో మొక్కలు నాటి స్వచ్ఛ చౌటుప్పల్ గా తీర్చిదిద్దామని మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. "పరిశుభ్రమైన వార్డు -- ఆరోగ్యవంతమైన ప్రజలు" అనే నినాదంతో 8,9,1011,19 వ వార్డులలో శనివారం వివిధ వార్డుల కౌన్సిలర్ల అధ్యక్షతన నిర్వహించిన ప్రజా అవగాహన - స్వచ్ఛత సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, సిఐ మన్మధ కుమార్ లు పాల్గొని "మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని తెలిపారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలన్నారు. ప్రజల ఆరోగ్యమే తమ ప్రాధాన్యతని తెలిపారు. వార్డులలో ప్రతి రోజు దోమల నివారణ మందు పిచికారీ, ఒక రోజు విడిచి ఒక రోజు డ్రైనేజీల పరిశుభ్రత పనులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మహిళాభివృద్ధి సాధికారిక కేంద్రాలు నిర్వహిస్తున్న కౌన్సిలింగ్ వారి అన్యోన్య దాంపత్యానికి బాటలు వేస్తుందని తెలిపారు. అనంతరం వారి చేతుల మీదుగా మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు కంకణ బద్ధుడు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఎనిమిదో వార్డులో లక్కారం చెరువు కట్ట సమస్య, బ్రహ్మంగారి గుడి నుండి హైస్కూల్ వరకు తారు రోడ్డు నిర్మాణం,వికలాంగుల కాలనీలో డ్రైనేజీ సమస్యలను మాజీ కౌన్సిలర్ కొయ్యాడ సైదులు మున్సిపల్ చైర్ పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. 8వ వార్డులో నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను మున్సిపల్ చైర్ పర్సన్ చేతుల మీదుగా ప్రారంభించారు. 9వ వార్డులో జంగాల కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అధిక ప్రాధాన్యత చైర్పర్సన్ హామీ ఇచ్చారు. పదో వార్డులో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కౌన్సిలర్ దేపరాజు రమ్య రాజు చైర్పర్సన్ కు వినతి పత్రాన్ని అందజేశారు. వార్డులో ఉన్న ప్రధాన సమస్యలన్నిటిని రాబోయే మూడు నెలల కాలంలోనే అధికారుల సమన్వయంతో పూర్తిగా పరిష్కరిస్తామని సభ ముఖంగా హామీ ఇచ్చారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల పట్ల వార్డు ప్రజలు, తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీఐ మన్మధ కుమార్ తెలిపారు.

**లికోతులు వీధికుక్కల సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం...**

వివిధ వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న కోతులు వీధి కుక్కల సమస్యపై చైర్ పర్సన్ స్పందిస్తూ వీధి కుక్కల నివారణకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తోపాటు, వాటి సంతానోత్పత్తి నివారణ చర్యలను కూడా చేపడతామని తెలియజేశారు. అలాగే కోతుల నివారణకు ప్రత్యేక ఏజెన్సీని ఏర్పాటు చేశామని, కోతులను పట్టుకొని అడవుల్లో వదిలేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. తాను మున్సిపల్ కార్యాలయంలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

**బహిరంగంగా చెత్త వేస్తే 5000 జరిమానా, కేసులు తప్పవు..**

పట్టణ పరిశుభ్రత పై మున్సిపల్ యంత్రాంగం కఠిన నిర్ణయం తీసుకుందని చైర్ పర్సన్ తెలిపారు. ఇళ్లలోని చెత్తను రోడ్లపై, మురికి కాలవలో, బహిరంగ ప్రదేశాలలో పడవేయకూడదని సూచించారు. చెత్త ఆటోలకు మాత్రమే అందించాలని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి బహిరంగంగా చెత్త వేసే వారికి 500 నుండి 5వేల వరకు భారీ జరిమానా విధించడంతోపాటు, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, సీఐ మన్మధ కుమార్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు కాసాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, వార్డు కౌన్సిలర్స్ బద్రి గాలయ్య,దేప రమ్య రాజు, పిల్లలమర్రి మధుసూదన్,షీ టీం అధికారులు,చౌటుప్పల్ మున్సిపల్ అధికారులు,వార్డు అధ్యక్షులు పోలోజు శీనివాస్ చారి ఇందిరామ్మ కామిటి మేబర్ చింతల మహీధర్, చిటు మహేష్, పబ్బు శ్రీకాంత్, కో ఆప్షన్ నెంబర్ సందగాళ్ల విజయ సతీష్,వార్డు ప్రజలు, మహిళలు, యువత, స్థానిక నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సాయం

**మంగపేట, జూన్06,హైదరాబాద్ మిర్రర్**

మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన కానూరి వెంకన్న (టైలర్ ) అనారోగ్యంతో భాధపడుతూ ఇటీవల మరణించగా శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం దశదిన కర్మలకు రాజుపేట గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుల చొరవతో రూ,13,500 రూపాయల నగదును మృతుడి తల్లి వైదేవమ్మకు ఆర్థిక సాయంగా అందజేసి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి తుమ్మూరి రాంరెడ్డి,మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పొట్రూ సమ్మయ్య,మండల ఎస్సి సెల్ అధ్యక్షుడు పళ్ళికొండ యాదగిరి,బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు వీర్ల జయకృష్ణ,బాధ విరారెడ్డి, చదలువాడ సత్యనారాయణ పాల్గొన్నారు.



## భూపాల్ రెడ్డి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

-60వ వివాహ వార్షికోత్సవ వేడుకల్లో కేసీఆర్ దంపతులతో భేటీ

-వెన్నవరం కుటుంబానికి తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తాం

-కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిన భూపాల్ రెడ్డి

-బీఆర్ఎస్ నేతల సమక్షంలో జరిగిన ప్రత్యేక సమావేశం

-దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్ష

-పార్టీకి కుటుంబం చేసిన సేవలను గుర్తు చేసిన కేసీఆర్

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 06:**



తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి తన సతీమణి గీతా భూపాల్ రెడ్డితో కలిసి తమ 60వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, శోభ కేసీఆర్ దంపతులను కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ దంపతులు భూపాల్ రెడ్డి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. వెన్నవరం కుటుంబం పార్టీకి అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ, భవిష్యత్తులో కుటుంబ సభ్యులకు తగిన రాజకీయ ప్రాధాన్యం, ఉన్నత స్థానం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ భేటీలో రామచంద్రాపురం మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ వి. ఆదర్శ్ రెడ్డి, భారతీనగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, భూపాల్ రెడ్డి కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణిలో భారీ కుంభకోణం..

## - రూ.1,600 కోట్ల బొగ్గు మాయంపై న్యాయ విచారణకు కేటీఆర్ డిమాండ్

**(ప్రజా వీక్షణం)**

సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైనట్లు కేటీఆర్ ఆరోపణసిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు డిమాండ్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసి విచారణ కోరిన కేటీఆర్ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (రాజజూ)లో సుమారు రూ. 1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు (కేటీఆర్) సంచలన ఆరోపణలు చేశారు. ఈ భారీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి కేటీఆర్ ఒక లేఖ రాశారు. సింగరేణిలోని పలు స్టాక్‌యార్డులలో బొగ్గు నిల్వల నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. రికార్డుల ప్రకారం బొగ్గుపై సెస్, ఆదాయపు పన్ను చెల్లించినప్పటికీ, క్షేత్రస్థాయి తనిఖీల్లో నిల్వల మధ్య భారీ వ్యత్యాసం కనిపించిందని వివరించారు. ఈ వ్యవహారం వెనుక బొగ్గును అక్రమంగా తరలించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించిన భారీ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఈ కుంభకోణం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ హస్తం ఉందని, లేదా బాధ్యులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి, కేంద్రంలోని బీజేపీ మంత్రులకు మధ్య లోపాయికారీ సంబంధాలు ఉన్నాయేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అందుకే కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ స్కామ్‌ను బయటపెట్టకుండా ఉండేందుకే తమ పార్టీ నేతలను అరెస్టు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## బీరంగూడ డివిజన్‌లో అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి

### జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన కాంగ్రెస్ నేత శశిధర్ రెడ్డి

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 06:**

సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీరంగూడ డివిజన్-270లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు అధ్వాన్నంగా ఉన్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండటం, డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు వెంటనే పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని శశిధర్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను అధికారులు ప్రాధాన్యతతో తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, మల్లేష్, కృష్ణ యాదవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## గాంధీ ఆసుపత్రిలో వట్టే జానయ్య యాదవ్‌ను పరామర్శించిన రమేష్ యాదవ్

-జానయ్య యాదవ్ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

-మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

-త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన రమేష్ యాదవ్

-గాంధీ ఆసుపత్రిలో బీసీ ఉద్యమ నాయకుడి పరామర్శ

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 06:**

గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీసీ ఉద్యమ నాయకుడు వట్టే జానయ్య యాదవ్‌ను తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. జానయ్య యాదవ్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే జానయ్య యాదవ్ ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ఆయన త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆరోగ్య మిత్రల నియామక పరీక్ష నిర్వహించిన డీఎంహెచ్ఓ

## ఆర్‌సి.పురం పీహెచ్‌సీ తనిఖీ.. నాణ్యమైన సేవలపై ఆదేశాలు

**సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 06:**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. లలితా దేవి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆరోగ్య మిత్రల నియామకానికి సంబంధించిన పరీక్షను నిర్వహించారు. అనంతరం ఆమె ఆర్‌సి.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి లేబర్ రూమ్, ప్రయోగశాల, వ్యాక్సినేషన్ రూమ్‌ల నిర్వహణను పరిశీలించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, సేవల నిర్వహణ సంతృప్తికరంగా ఉండటంతో మెడికల్ ఆఫీసర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రిని నిర్దేశిత సమయాలకు అనుగుణంగా తెరిచి ఉంచాలని, విధులకు ఆలస్యంగా హాజరయ్యే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా కృషి చేయాలని సిబ్బందికి డీఎంహెచ్‌వో సూచించారు.



# భగత్‌సింగ్‌నగర్‌లో వార్డు సభ విజయవంతం

## ప్రజా సమస్యల స్వీకరణ, సంక్షేమ పథకాల దరఖాస్తుల నమోదు

**రామకృష్ణాపూర్,జూన్ 6:హైదరాబాద్ మిర్రర్**

రామకృష్ణాపూర్ పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ 22వ వార్డులో స్నేహ గణేష్ మండపం వద్ద నిర్వహించిన వార్డు సభ విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో వార్డు వైస్ చైర్‌పర్సన్ మిట్టపెల్లి సరిత,1వ వార్డు కౌన్సిలర్ కౌడగాని సాంబయ్య,15వ వార్డు కౌన్సిలర్ అర్నె సంధ్య,19వ వార్డు కౌన్సిలర్ రంగలక్ష్మి,ఏఎస్ఐ సతయ్య,సానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్,రెవెన్యూ అధికారి సతీష్, మున్సిపల్ సిబ్బంది,సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్,బీఆర్ఎస్ వార్డు ఇన్‌చార్జ్ కరుణాకర్,స్వప్న, సీపీఐ నాయకులు మిట్టపెల్లి పౌలు,లింగయ్య,మహిళా నాయకులు శ్రీజ,మౌనిక తదితరులు పాల్గొన్నారు.వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.అలాగే వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు.

**కోఆప్షన్ నామినేషన్ :**

ఈ సందర్భంగా సీపీఐ పార్టీ తరపున మైనారిటీ కోటాలో కో-ఆప్షన్ సభ్యుని పదవికి మిట్టపెల్లి పౌలు నామినేషన్ దాఖలు చేశారు.





# 75 ఏళ్ల వృద్ధుడికి రెండు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

-మళ్లీ స్వతంత్రంగా నడిచేలా చేసిన మెడికవర్ వైద్యులు

-అద్భుతమైన వైద్య సేవలు అందించిన మెడికవర్ వైద్య బృందానికి అభినందనలు

-75 ఏళ్ల వయసులో మళ్లీ నడిచేలా చేయడం నిజంగా గొప్ప విజయం

-వయసు కాదు, సరైన వైద్యం ఉంటే జీవితంలో కొత్త ఆశలు చిగురిస్తాయి

-ఆధునిక వైద్యం అద్భుతాలు సృష్టిస్తోందనడానికి ఇదే నిదర్శనం

-వాకర్‌ను మరో రోగికి దానం చేయడం ఎంతో గొప్ప మనసుకు నిదర్శనం

-రోగికి కొత్త జీవితం ప్రసాదించిన వైద్యులకు సెల్యూట్

-ఇలాంటి విజయవంతమైన చికిత్సలు మరెందరికో ఆశాకిరణంగా నిలుస్తాయి

-ఆరోగ్య సేవల్లో మెడికవర్ మరోసారి తన ప్రతిభను చాటుకుంది

-కరణం రాఘవేంద్ర రావు ఆత్మవిశ్వాసం అందరికీ స్ఫూర్తిదాయకం

-డా. శశివర్ధన్ మరియు వైద్య బృందానికి హృదయపూర్వక అభినందనలు

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 06:**

వయసు పెరిగిందంటే నడవడం కష్టమే అనే అపోహలను చెరిపేస్తూ, 75 ఏళ్ల వృద్ధుడికి రెండు మోకాళ్ల మార్పిడి (బైలాటరల్ టోటల్ నీ రీప్లేస్‌మెంట్) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి ఆయనకు మళ్లీ స్వతంత్రంగా నడిచే అవకాశం కల్పించినట్లు మెడికవర్ హాస్పిటల్స్, చందానగర్ వైద్యులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రాఘవేంద్ర గత కొన్నేళ్లుగా రెండు మోకాళ్లలో తీవ్రమైన ఆస్టియోఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. దీంతో నడవడం, మెట్లు ఎక్కడం, కుర్చీ నుంచి లేవడం వంటి సాధారణ పనులు కూడా కష్టంగా మారాయి. వయసుతో పాటు థైరాయిడ్ సమస్య, గతంలో స్ట్రోక్ రావడం వంటి ఆరోగ్య సమస్యల కారణంగా శస్త్రచికిత్స చేయించుకోవడంపై ఆయన సందిగ్ధత వ్యక్తం చేశారు. అయితే సమగ్ర వైద్య పరీక్షల అనంతరం ఆర్థోపెడిక్ సర్జన్ డా. శశివర్ధన్ నేతృత్వంలోని వైద్య బృందం రెండు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. శస్త్రచికిత్స అనంతరం మొదటి రోజే రోగిని నిలబెట్టి పూర్తి బరువుతో నడిపించారు. ప్రత్యేక ఫిజియోథెరపీ, పునరావాస చికిత్సలతో ఆయన కోలుకునే ప్రక్రియ వేగంగా సాగి, నెల రోజుల్లోనే ఎలాంటి సహాయక పరికరం లేకుండా స్వయంగా నడిచే స్థితికి చేరుకున్నారు. కోలుకునే సమయంలో ఉపయోగించిన వాకర్‌ను మరో రోగికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఆసుపత్రికి విరాళంగా అందించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా డా. శశివర్ధన్ మాట్లాడుతూ, ఆధునిక జాయింట్ రీప్లేస్‌మెంట్ సాంకేతికత, మెరుగైన నొప్పి నియంత్రణ విధానాలు, వ్యక్తిగత పునరావాస చికిత్సల వల్ల వృద్ధాప్యంలో కూడా అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. తీవ్రమైన మోకాళ్ల నొప్పిని వయసు సహజ లక్షణంగా భావించకుండా నిపుణులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ మల్లేశ్ పాల్గొన్నారు. రాఘవేంద్ర కోలుకున్న తీరు, సరైన వైద్యంతో వృద్ధాప్యంలోనూ నొప్పిలేని జీవితం సాధ్యమని మరోసారి నిరూపించిందని వైద్యులు పేర్కొన్నారు.






# మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణపై గ్రామ సభల్లో అవగాహన

## గొల్లపల్లి గ్రామ సభలో పాల్గొన్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 06:**

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ సభల్లో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు చట్టాలు, భద్రతా అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, పోక్సో కేసులు, భరోసా కేంద్రం సేవలు, షీ-టీమ్స్ పనితీరు, సైబర్ నేరాల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. షీ-టీమ్స్ పాఠశాలలు, కళాశాలలు, బస్ స్టాండ్లు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తూ మహిళల భద్రతకు కృషి చేస్తున్నాయని తెలిపారు. అలాగే పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు మెడికో-లీగల్ సేవలు, కౌన్సెలింగ్, సహాయ సహకారాలు భరోసా కేంద్రం ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా జిల్లా షీ-టీమ్ నంబర్ 8712656772, ఉమెన్ హెల్ప్‌లైన్ 181 లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. సైబర్ నేరాలపై మాట్లాడుతూ, అధిక లాభాల పేరుతో మోసగాళ్లు ప్రజలను వలలో వేసుకుంటున్నారని హెచ్చరించారు. అపరిచితుల పంపే లింకులు, ఏపీకే ఫైళ్లు ఓపెన్ చేయవద్దని, ఆన్‌లైన్ పెట్టుబడుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్సిల్, కొరియర్ పేరుతో కూడా మోసాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్పీ ప్రారంభించారు. నేరాల విచారణకే కాకుండా నేరాల నివారణలో కూడా సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మునిపల్లి మండలంలో నిర్వహించిన గ్రామ సభలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పాల్గొని మహిళల రక్షణకు ప్రభుత్వం, పోలీసు శాఖ అందిస్తున్న సేవలను వివరించారు. గ్రామస్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్, మహిళలు, గ్రామస్థులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.








# కోహెడలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

## రైతుల ముందస్తు అరెస్టులకు నిరసనగా బిఆర్ఎస్ నాయకుల ఆందోళన

**తుర్కయంజాల్, హైదరాబాద్ మిర్రర్:**

కోహెడ గ్రామంలో రైతుల ముందస్తు అరెస్టులకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా, భూ బాధితులకు న్యాయం చేయకుండా మార్కెట్ ప్రారంభోత్సవం నిర్వహించడం సరికాదని వారు విమర్శించారు. ముందుగా రైతుల అభ్యంతరాలు, సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, అనంతరం మార్కెట్‌ను ప్రారంభించాలని నినాదాలు చేశారు.ప్రభుత్వం రైతుల ఆవేదనను గుర్తించి, భూ బాధితులకు తగిన పరిహారం, న్యాయం అందించాలని టీఆర్ఎస్ నాయకులు కోరారు. రైతుల హక్కులను కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

# ఉన్నత లక్ష్యాల సాధనకు క్రమశిక్షణే మార్గం: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

## స్పార్క్ కార్యక్రమంలో ఖాకీ సిబ్బంది, వారి పిల్లలకు అధికారుల మార్గదర్శనం

**సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 06:**

ఖాకీ సిబ్బంది, వారి పిల్లలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పార్క్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఖాకీ సిబ్బంది, వారి పిల్లలకు పోటీ పరీక్షల సన్నద్ధత, ఉన్నత లక్ష్యాల సాధనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ స్థాయి నుంచి కృషి, పట్టుదలతో ఉన్నత స్థానాలకు ఎదిగిన డిప్యూటీ కలెక్టర్ మురళి మాధినేని, ట్రైనీ డీఎస్పీ సుజాత, ఐఆర్ఎస్ అధికారి ప్రత్యూష తమ విజయ గాథలను పంచుకొని పాల్గొన్న వారికి స్ఫూర్తినిచ్చారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే లక్ష్య సాధన కోసం ఎలా కష్టపడ్డారో, పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమయ్యారో వివరించారు. ఐఆర్ఎస్ అధికారి ప్రత్యూష మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ వైద్యురాలిగా విధులు నిర్వర్తిస్తూనే యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమై పలుమార్లు వైఫల్యాలు ఎదురైనా నిరాశ చెందకుండా ప్రయత్నించి ఐఆర్ఎస్ సాధించానని తెలిపారు. విజయంపై నమ్మకం ఉంటే ఎలాంటి అడ్డంకులనైనా అధిగమించవచ్చని చెప్పారు. డిప్యూటీ కలెక్టర్ మురళి మాధినేని మాట్లాడుతూ.. పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి గ్రూప్-4, గ్రూప్-3 పరీక్షల్లో విజయం సాధించిన అనంతరం గ్రూప్-1 ద్వారా డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైనట్లు తెలిపారు. కష్టాన్ని నమ్ముకుని నిరంతరం శ్రమించిన వారినే విజయం వరిస్తుందని పేర్కొన్నారు. ట్రైనీ డీఎస్పీ సుజాత మాట్లాడుతూ.. జీవితంలో ఎదురయ్యే ఆర్థిక, కుటుంబ సమస్యలను అధిగమిస్తూ లక్ష్య సాధన కోసం కష్టపడి చదవాలని సూచించారు. కానిస్టేబుల్‌గా ప్రారంభమైన తన ప్రయాణం డీఎస్పీ స్థాయికి చేరిందని తెలిపారు.

అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. స్పార్క్ కార్యక్రమం ద్వారా పోలీసు సిబ్బంది కుటుంబాల్లో విద్యా ప్రగతి, వ్యక్తిత్వ వికాసం, ఉన్నత ఉద్యోగాల సాధనకు అవసరమైన ప్రోత్సాహం అందించడం జిల్లా పోలీసు శాఖ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు సిబ్బంది, వారి పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.






# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## ప్రజా పాలన వార్డు సభల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి

**రామకృష్ణాపూర్,జూన్ 6:హైదరాబాద్ మిర్రర్**

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11,13వ వార్డుల్లో నిర్వహించిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" వార్డు సభ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని ప్రజల నుంచి వినతులు, సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా,సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అలాగే వార్డుల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పూర్తి విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, రామకృష్ణాపూర్ టౌన్ ఎస్ఐ శ్రీధర్,11వ వార్డు కౌన్సిలర్ భోమ్మ భూమా గౌడ్,13వ వార్డు కౌన్సిలర్ జక్కబోయిన మంజుల--కుమార్,వివిధ శాఖల అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ధర్మోజి గూడెం ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

## - చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ధర్మోజీగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా

**చౌటుప్పల్, జూన్ 6, హైదరాబాద్ మిర్రర్ :**

ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరుగుతున్నాయని.. చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ధర్మోజీగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మాలు అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజీగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం వారు సందర్శించారు. ధాన్యం కొనుగోళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగంగా కొనుగోలు సాగుతున్నాయన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు పూర్తవుతాయన్నారు. ధాన్యం నిల్వలకు వీలుగా ధర్మోజిగూడెం పరిధిలోనే ఒక గోదామును ఏర్పాటు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, వీరమళ్ళ సత్తయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీహరి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, గ్రామ ఉప సర్పంచ్ పక్కీరు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, ఐతరాజు శారద లింగస్వామి, జీడిమడ్ల శోభ కొండల్, గునుగంటి వెంకటేశం గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కొంతం బుచ్చి రెడ్డి, ఊదరి లింగయ్య, ఊదరి పెంటయ్య, కొంతం కృష్ణారెడ్డి, పగిళ్ళ లింగారెడ్డి, ఏనుగు ఇస్త్రారీ రెడ్డి, ఏనుగు లింగారెడ్డి, ఊదరి ఎల్లయ్య, జక్కలి యాదయ్య, జక్కలి మల్లయ్య, చేన్నోజు విజయ చారి, ఊదరి స్వామి, డాకోజీ సతీష్, ఊదరి కృష్ణమూర్తి, గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# బృందావన్ కాలనీలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పర్యటన

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

**గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )**

మైలార్దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శనివారం అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను స్వయంగా పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధి దీపాల పరిస్థితిపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆరా తీశారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్న ఆయన, సంబంధిత అధికారులకు అక్కడికక్కడే తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల అభివృద్ధిపై తక్షణమే దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రాధాన్యత అని పేర్కొంటూ, డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి కనీస వసతుల్లో ఎలాంటి లోపాలు ఉండకూడ దన్నారు. ఈ పర్యటనలో అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య, ఈఈ, జలమండలి అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.



# ప్రజా సేవే జీవిత లక్ష్యంగా మార్చుకున్న తల్లోజు ఆచారి

**బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)**

భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, మాజీ జాతీయ బిసి కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి పుట్టినరోజు సందర్భంగా వారి నివాసానికి వెళ్లి గజమాలవేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన మీర్పేట్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ పసునూరి బిక్షపతి చారి. ఈ సందర్భంగా బిక్షపతి చారి మాట్లాడుతూ అను నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ, ఉద్యమలే ఊపిరిగా, అభివృద్ధే ధ్యేయంగా, తన కష్టాన్ని నమ్ముకొని, నిస్వార్థమైన కార్యకర్తలను తయారు చేసి పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తూ ఎన్ని ఇబ్బందులు వచ్చినా గెలుపే లక్ష్యంగా పని చేస్తూ సేవే ఊపిరిగా తన జీవితాన్ని మార్చుకున్న తల్లోజు ఆచారి ఆయురారోగ్యాలతో, మరెన్నో వసంతాలు ప్రజాసేవలో కొనసాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భీమ్ రాజ్, కలకొండ శ్రీనివాస చారి, మురుపోజు శివకుమార్ చారి, కుమార్, లక్ష్మణ చారి, అజయ్ చారి, తదితరులు పాల్గొన్నారు



# బోయపల్లి రాఘవేంద్ర ఆధ్వర్యంలో కోహెడ కు కాంగ్రెస్ శ్రేణులు

**బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)**

కోహెడ గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ఏఐసిసి కో-ఆర్డినేటర్ (విచార్ విభాగ్) మరియు సీఎం రేవంత్ రెడ్డి అంద్రాయిడ్ టీమ్ సభ్యులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి నేతృత్వంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు యువత భారీ ఎత్తున తరలివెళ్లారు. అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు, మహేశ్వరం గడ్డపై నుంచి ఒక భారీ సైన్యంలా యువత, నాయకులు నూతనోత్తేజంతో కోహెడ వైపు అడుగులు వేశారు.



# ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తలారి హరికృష్ణ ముదిరాజ్ వీడని హత్యా మిస్టరీ

## -నిందితులపై హత్యా కేసు పెట్టాలి -బాధితులకు న్యాయం చేయాలి

**కోడంగల్, జూన్ 06(హైదరాబాద్ మిర్రర్):**

కోడంగల్ మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం కోడంగల్ మండల అధ్యక్షులు బోయిని వెంకటయ్య అడ్వకేట్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడమైనది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామానికి చెందిన తలారి హరిక్రిష్ణ ముదిరాజ్ 27 సం ల యువకుడు పోలం పని నిమిత్తమై 29-4-2026 తన గ్రామం జీవన్గి నుంచి రుద్రారం గ్రామానికి వచ్చి శవమై తేలాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు ఘటన స్థలానికి వచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించడం గాని, ఆదారాలు సేకరించడం గాని చేయలేదని తెలిపారు. పలు దాపాలుగా పోలిసులను ఆశ్రయించడం జరిగింది కాని కేసు పురోగతి గురించి ఎలాంటి ప్రయత్నం చేయలేదు. సంఘటన జారిగి దాదాపుగా 40 రోజులు కావస్తున్న కాని నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరిస్తున్నారు. నిందితులను గుర్తించే ప్రయత్నం చేయలేదు. నిందితులను కాపాడుతున్నట్లు అనిపిస్తుందని బాధితులు విచారం వ్యక్తం చేసారు. కాలుట్టి, బీసీ, ఎస్సీ , ఎస్టీ లపై జరుగుతున్న దాడులకు నిరసంగా అన్ని ప్రజాసంఘాల మద్దతుతో బాదితులకు తగు న్యాయం జరిగే విధంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు . ప్రెస్ మీట్ లో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కొత్తూరు చంద్రయ్య,స్వైరో కోడంగల్ డివిజన్ అధ్యక్షుడు కుప్పగిరి సాయిలు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు అన్నారం సాయిలు,మూడనమ్మకాల నిర్మూలన సమితి సభ్యులు జుంటుపల్లి ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటయ్య,జిల్లా అధ్యక్షులు సిహెచ్ లక్ష్మీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ , వివిధ మండలాల ముదిరాజ్ సంఘాలు తదితర ప్రజాసంఘాలు పాల్గొన్నారు.



# శంషాబాద్ 119 డివిజన్ బిఆర్ఎస్ యూత్ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన సాయి కిరణ్ గౌడ్

## రాజేంద్రనగర్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేత

**గండిపేట్ : హైదరాబాద్ మిర్రర్**

శంషాబాద్ పరిధిలోని 119 డివిజన్ బిఆర్ఎస్ పార్టీ యూత్ జనరల్ సెక్రటరీ గా సాయి కిరణ్ గౌడ్ (పెట్రోల్ సాయి) నియమితులయ్యారు. భారత రాష్ట్ర సమితి రాజేంద్రనగర్ ఇన్చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి చేతుల మీదుగా సాయి కిరణ్ గౌడ్ నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా సాయి కిరణ్ గౌడ్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పార్టీ అధికారంలోకి రావడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ కొనమల్ల శ్రీనివాస్, చిన్న గండు రాజేందర్, బుచ్చిరెడ్డి, హనుమంతు ముదిరాజ్, వెంకట్ రెడ్డి,రమేష్ రాథోడ్, రమేష్ రాచమల్ల, జీవీపీ సాగర్, శ్రీకాంత్, రజనీకాంత్ రాచమల్ల కార్తీక్,మల్లేష్ మంచాల, మంచర్ల కిట్టు, శేఖర్ రోవన్ మణికంఠ పాల్గొన్నారు.



# వట్టినాగులపల్లి ప్రజలకు శుభవార్త.. ఉచిత ఆరోగ్య శిబిరం నేడే

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )

వట్టినాగులపల్లి గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రేపు ఉదయం 9 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు బ్యాగరి విష్ణువర్ధన్ తెలిపారు. ఈ శిబిరంలో మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు మరియు వైద్య సిబ్బంది పాల్గొని గ్రామస్తులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. గ్రామంలోని పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో పాల్గొని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అవసరమైన వైద్య సలహాలు పొందాలని సూచించారు. ఆరోగ్యంగా ఉందాం -- అనారోగ్యానికి గుడ్‌బై చెబుదాం అనే సందేశంతో గ్రామ ప్రజలందరూ తప్పనిసరిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు




# నార్సింగి నూతన డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )

నార్సింగి సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ని శనివారం గండిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభి నందించారు. ఈ సందర్భంగా గండిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు సంధ్యా రాము, జల్లి సాయిరాం, మాజీ వార్డు సభ్యులు సునీత ప్రభు, లల్లు ప్రసాద్ యాదవ్ తదితరులు డిప్యూటీ కమిషనర్‌కు బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం నార్సింగి సర్కిల్ పరిధిలో ఉన్న పలు ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను విన్న డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి, ప్రజల సంక్షేమం మరియు ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 2020లో మంజూరు.. 2026లోనూ పూర్తి కాని కమ్యూనిటీ హాల్ నిర్మాణం

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )



నర్సింగి ఎస్సీ బస్తీలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్ (రిజిస్ట్రేషన్ నం. 79/65) పునర్నిర్మాణ పనులు 2020లో మంజూరైనప్పటికీ ఇప్పటి వరకు పూర్తి కాకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజలకు సామాజిక, విద్యా, సాంస్కృతిక, సంక్షేమ కార్యక్ర మాలకు ఉపయోగపడే ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణం సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియక స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు మంజూరైన నిధులు, ఇప్పటివరకు జరిగిన ఖర్చు, కాంట్రాక్టర్ వివరాలు, పనులు ఆలస్య మవడానికి గల కారణాలపై పూర్తి సమాచారం కోసం జీహెచ్ఎంసీకి సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద దరఖాస్తు సమర్పించారు. ప్రజల డబ్బుతో చేపట్టిన అభివృద్ధి పనులపై పూర్తి పారదర్శకత ఉండాలని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేసి కమ్యూనిటీ హాల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం, జీహెచ్ఎంసీ అధికారులు, సంబంధిత శాఖలు తక్షణమే చర్యలు చేపట్టి పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డి. పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆనంద్‌నగర్ కాలనీలో లిఫ్ట్ ప్రమాదం

## మహిళ మృతి..బాలుడికి తీవ్ర గాయాలు

హైదరాబాద్,జూన్6(హైదరాబాద్ మిర్రర్):

ఖైరతాబాద్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆనంద్ నగర్ కాలనీలో ఉన్న భావన అపార్ట్‌మెంట్స్‌లో లిఫ్ట్ ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమెతో ఉన్న మనవడు గాయపడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఆనంద్ నగర్ కాలనీలోని భావన అపార్ట్‌మెంట్స్ లో లిఫ్ట్‌లో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రాధ (58) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదం అపార్ట్‌మెంట్ 5వ అంతస్తులో జరిగింది. లిఫ్ట్ పూర్తిగా ఆ అంతస్తుకు చేరుకోకముందే బాధితురాలు తలుపు తెరిచింది. దీంతో ఆమె ఒక్కసారిగా లిఫ్ట్ గుంతలో పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది

# విద్య ప్రతి మానవుడి ప్రాథమిక హక్కు – ఆ హక్కును డబ్బుతో కొనాల్సిన అవసరం లేదు

## నాణ్యమైన విద్య అందించడమే మా లక్ష్యం: ఈఎల్వీ అశోక్

సంస్థాన్ నారాయణపురం జూన్ 6(హైదరాబాద్ మిర్రర్):

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం
అల్లం దేవి చెరువు గ్రామంలో గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ విజ్ఞప్తి మేరకు ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న నూతన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ఫౌండేషన్ ప్రతినిధి ఈఎల్వీ అశోక్ శనివారం సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగం ప్రకారం విద్య ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. ఆ హక్కును పొందేందుకు తల్లిదండ్రులు తమ కష్టార్జిత సంపాదనను భారీ ఫీజుల రూపంలో ప్రైవేట్ పాఠశాలలకు వెచ్చించాల్సిన పరిస్థితి మారాలని అన్నారు.
ప్రభుత్వ పాఠశాలల్లోనే కార్పొరేట్ స్థాయి విద్య, క్రమశిక్షణ, నాణ్యమైన బోధన, మంచి సంస్కారాలను అందించాలనే లక్ష్యంతో ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ అల్లం దేవి చెరువు గ్రామంలో నూతన పాఠశాల భవన నిర్మాణాన్ని చేపట్టిందని తెలిపారు. గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ విద్యాభివృద్ధి సంకల్పానికి తోడ్పాటుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామంలోని తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రైవేట్ పాఠశాలల్లో లభించే విద్యకు ఏమాత్రం తీసిపోకుండా, అంతకంటే మెరుగైన విద్యా ప్రమాణాలు అందేలా ఫౌండేషన్, గ్రామ పంచాయతీ సంయుక్తంగా చర్యలు తీసుకుంటాయని హామీ ఇచ్చారు.
అదేవిధంగా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ఉపాధ్యాయులను నియమించి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ని, విద్యాశాఖ అధికారులను ఈ సందర్భంగా ఆయన కోరారు.
గ్రామీణ ప్రాంత విద్యాభివృద్ధికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేసినప్పుడే విద్యారంగంలో గుణాత్మక మార్పులు సాధ్యమవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ గ్రామ సామాజిక కార్యకర్తలు అంతటి సురేష్ గౌడ్,సుర్వి సురేష్ గౌడ్,సుర్వి లింగస్వామి గౌడ్ గ్రామపంచాయతీ సిబ్బంది ఏర్పుల నాగేష్,ఏర్పుల గాలయ్య, ముక్కర్ల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు



# కోహెడ రైతులకు న్యాయం చేయకుండా మార్కెట్ శంకుస్థాపన సరికాదు

-మార్కెట్ శంకుస్థాపన కోసం రైతులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం

-అనుకూల భూమిని వదిలి గుట్టలపై మార్కెట్ ఎందుకు..?

-కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి ఫైర్

-300 కోట్లతో సిద్ధమైన స్థలాన్ని వదిలేసి కొత్త వివాదానికి తెరలేపిన ప్రభుత్వం

తుర్కయంజాల్, హైదరాబాద్ మిర్రర్

కోహెడ రైతులకు న్యాయం చేయకుండా మార్కెట్ శంకుస్థాపన సరికాదనీ, సమీకృత ఫ్రూట్ మార్కెట్ స్థల మార్పుపై మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని రొక్కశీ సత్తిరెడ్డి గార్డెన్ లో బీఆర్ఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సర్వే నంబర్లు 507, 548లో అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సర్వే నంబర్ 167/1లో మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సరైన నిర్ణయం కాదని విమర్శించారు. 170 ఎకరాల విస్తీర్ణంలో రెవెన్యూ, ఇంజనీరింగ్, మార్కెటింగ్ శాఖల అధికారులు ఎంతో కష్టపడి భూమిని చదును చేశారని తెలిపారు. అయితే రెండున్నర సంవత్సరాలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎలాంటి సమగ్ర అధ్యయనం లేకుండానే మార్కెట్‌ను మరో ప్రాంతానికి తరలిస్తోందని ఆరోపించారు. ఓఆర్ఆర్‌కు సమీపంలో ఉన్న సర్వే నంబర్ 167/1లో చెట్లు, గుట్టలు అధికంగా ఉండటంతో మార్కెట్ నిర్మాణానికి అనుకూల పరిస్థితులు లేవని పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని విధాలుగా అనుకూలమైన భూమి అందుబాటులో ఉండగా దానిని వదిలిపెట్టి ఎత్తైన ప్రాంతాన్ని ఎంపిక చేయడం వల్ల భవిష్యత్తులో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. సర్వే నంబర్ 167/1లో 120 మంది రైతులు తరతరాలుగా సాగు చేస్తున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటోందని, ఇప్పటివరకు రైతులకు తగిన నష్టపరిహారం కూడా చెల్లించలేదని ఆరోపించారు. రైతులపై కేసులు నమోదు చేయడం, నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనకు ముందు ఇంటెలిజెన్స్, పరిపాలనా వర్గాల నుంచి పూర్తి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అనేక శంకుస్థాపనలు జరుగుతున్నప్పటికీ పనుల పురోగతి కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన మార్కెట్ కోసం డీపీఆర్ సిద్ధం చేసి రూ.300 కోట్లు మార్కెట్ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. అలాగే 507, 548 సర్వే నంబర్లలోని రైతులకు రూ.17.25 కోట్ల పరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించామని, ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. రైతులకు తక్షణమే పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాత మాత్రమే మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కోల్డ్ స్టోరేజీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల పేరుతో భూములను ఇతరులకు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలను వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్‌ను తిరిగి సర్వే నంబర్లు 507, 548లోనే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి లక్ష్మారెడ్డి, కళ్యాణ్ నాయక్, సంజీవరెడ్డి, ఆనంద్ రెడ్డి,చెవుల దశరథ,గౌతమ్ రెడ్డి, కొండ్రు మల్లేష్, చెన్నయ్య, సంపదీశ్వర్, మోహన్ గుప్తా,మేతరి అశోక్, గౌని వినోద్ గౌడ్,నరేందర్,రాజు గౌడ్, వెంకట్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



# కోహెడ భూ బాధితులకు అండగా నిలిచినందుకే కాంగ్రెస్ నాయకులు అరెస్టులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్,బిఆర్ఎస్,బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు

తుర్కయంజాల్, హైదరాబాద్ మిర్రర్:

కోహెడ భూ బాధిత రైతులకు మద్దతుగా నిలిచినందుకు తమపై పోలీసులు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరు ద్ధమని కాంగ్రెస్ నాయకులు,మాజీ కౌన్సిలర్లు కంబాలపల్లి ధనరాజ్,బండారు బాలప్ప తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కోహెడలో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ కు శంకుస్థాపన చేసేం దుకు రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి విచ్చేస్తుండడంతో కాంగ్రెస్, బిఆర్ఎస్, బీజేపీ నాయకులను ముంద స్తుగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియా గ్రూపులలో షేర్ చేయడం వైరల్ గా మారింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కోహెడ గ్రామానికి చెందిన మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులమని చూడకుండా రైతులకు మద్దతు ఇచ్చామని విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఒత్తిడితో తమను అరెస్ట్ చేయించారని ఆరోపించారు. బీజేపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కందాల బల్ దేవ్ రెడ్డి,బిఆర్ఎస్ నాయకులు బిందు రంగారెడ్డి మాట్లాడుతూ రైతుల హక్కుల కోసం,భూ బాధితులకు న్యాయం జరగాలని కోరుతూ శాంతియుతంగా మద్దతు తెలుపుతుంటే అరెస్టులకు పాల్ప డటం దురదృష్టకరమని విమర్శించారు. కోహెడలో భూములు కోల్పోయిన రైతుల సమ స్యలను పరిష్కరించాల్సిన ప్రజా ప్రతినిధులు, వారిని ఆదుకోవాల్సింది పోయి ఉద్యమాలను అణిచివేసే ప్రయత్నం చేయడం సరైన విధానం కాదన్నారు. రైతుల పక్షాన నిలబడిన వారిని భయభ్రాంతులకు గురిచేసి ఉద్యమాన్ని అణచివేయాలనే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తిప్పికొడుతుందని స్పష్టం చేశారు. భూ బాధిత రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, ప్రజాస్వామ్య హక్కుల కోసం వెనక్కి తగ్గబోమని కంబాలపల్లి ధనరాజ్,బండారు బాలప్ప, నరసింహారెడ్డి,బల్ దేవ్ రెడ్డి,బిందు రంగారెడ్డి హెచ్చరించారు.





# పక్షుల సంరక్షణపై బర్డ్ వాక్ పోచారం డిబిసిలో అదనపు కలెక్టర్ నగేశ్ ప్రారంభం

మెదక్,జూన్6(హైదరాబాద్ మిర్రర్):

ప్రకృతి పరిరక్షణ, పక్షుల సంరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో బర్డ్ వాక్ కార్యక్రమం నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. శనివారం పోచారంలోని డీబీసీలో నిర్వహించిన బర్డ్ వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోచారం ల్యాండ్‌స్కేప్‌లో గొప్ప పక్షి వైవిధ్యం, సహజ వారసత్వం ఉందని దీనిని కాపాడేందుకు బర్డ్ వాక్ నిర్వహించామన్నారు. పోచారం జలాశయం , అభయారణ్యం చుట్టూ ఉన్న పోచారం ప్రాంతం, వలస నీటి పక్షులు, కొంగలు, ఐబీస్‌లు, బాతులు అనేక అటవీ ప్రాంతాలతో సహా విభిన్న పక్షి జీవనానికి ప్రసిద్ధి చెందిందన్నారు. ఇది ఒక ముఖ్యమైన పక్షి వీక్షణ గమ్యస్థానంగా నిలుస్తుందనీ పేర్కొన్నారు. ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని వివిధ రకాల పక్షులను వీక్షించాలని కోరారు. పక్షుల జీవన విధానం, వలస పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్రను వివరించాలని సూచించారు. పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లు నాటాలని, నీటి వనరులను కాపాడాలని, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి , మెదక్ డీపీఆర్వో రామచంద్ర రాజు, ఎఫ్ఆర్వోలు , బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.




హైదరాబాద్ మిర్రర్
ప్రతి ఉదయం.. జన హృదయం






# కాక్‌టెయిల్-2 లో నటించడానికి భయపడ్డా: రష్మిక

కొద్ది రోజుల్లో 'కాక్‌టెయిల్ 2'తో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతోంది అందాల తార రష్మిక. ఆమె, షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో దియా పాత్రలో కనిపించనుంది రష్మిక. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక.. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. 'ఈ ప్రాజెక్టులో నటించడం గురించి నేను అంత సులభంగా నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యంగా ఇందులో నటించడానికి నిజంగా భయపడ్డాను. ఎందుకంటే ఇప్పటి వరకు నేను భాగమైన చిత్రాల్లో ఇంత మోడ్రన్‌గా కనిపించలేదు. అందుకే ప్రారంభంలో ఈ చిత్రంలో నటించడం గురించి నేను తీసుకున్న నిర్ణయం సరైందా? కాదా? అనే సందేహం ఉండేది. కానీ అదే సమయంలో ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి పాత్రలో చేయలేదు కాబట్టి.. ఇందులో నటించాను' అని చెప్పింది.




# జూలై నుంచి కల్కి-2 రెగ్యులర్ షూటింగ్

ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న 'కల్కి 2' అప్‌డేట్ గురించి నాగ్ అశ్విన్ క్లారిటీ ఇచ్చారు. సినిమా పనుల గురించి వివరణ చేస్తూ.. కల్కి 2 షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే జూలై నుండి కంటిన్యూగా షూటింగ్ ప్లాన్ చేశాం. చాలా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసేలా అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని నాగ్ అశ్విన్ వెల్లడించారు. ఈ అప్‌డేట్‌తో ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.




# రామాయణ, వారణాసి బడ్జెట్ లెక్కలుహైప్ క్రియేట్ చేస్తున్నారని కొట్టి పారేసిన మనోజ్

రామాయణ' పై 4000 కోట్ల బడ్జెట్ పెట్టారు. పాన్ ఇంటర్నేషనల్ మూవీ 'వారణాసి', 1300 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతోంది. రామాయణ, వారణాసి బడ్జెట్ షాక్ ఇస్తోంది. అయితే ఇందులో ఎంతమాత్రం నిజం లేదని ఇదంతా కేవలం హైప్ క్రియేట్ చేయడానికే అని బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్ తేల్చి పారేసాడు. రాజమౌళి అంటేనే బ్జడెట్. తెలుగు తెరకే కాదు, ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌కు భారీ బ్జడెట్, భారీ వసూళ్లు ఎలా ఉంటాయో చూపించాడు రాజమౌళి. తెలుగు సినిమా బ్జడెట్ 20 కోట్ల లోపే ఉన్న సమయంలో, 'మగధీర' పై 40 కోట్లు పెట్టించాడు. బాక్స్ ఆఫీస్ దగ్గర 50 కోట్ల మార్కు దాటిన తొలి చిత్రంగా 'మగధీర' నిలిచింది. ఇక 'బాహుబలి 2' తో రాజమౌళి సెట్ చేసిన రికార్డులు ఇప్పటికీ కొన్ని చోట్ల పదిలంగానే ఉన్నాయి. మరి ఇంత ట్రాక్ రికార్డు ఉన్న రాజమౌళి, 'వారణాసి' తో పాన్ ఇంటర్నేషనల్‌కు పరిచయం అవుతున్నాడు. దీనికి తగ్గట్టే బ్జడెట్ పెంచేసాడు. 'వారణాసి' 800 కోట్ల బ్జడెట్‌తో మొదలైంది. సెట్స్ పైకి వెళ్ళాక 1000 కోట్లు అన్నారు. ఏడాది పాటు షూటింగ్ పూర్తి చేశాక, 1300 కోట్లకు వెళ్ళిందన్నారు. సినిమా పూర్తి అయ్యేసరికి 1500 కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్, రామాయణ, వారణాసి బ్జడెట్‌పై చేసిన షాకింగ్ కామెంట్స్ వైరల్ అయ్యాయి. ఈ సినిమాల బ్జడెట్ లెక్కలన్నీ కేవలం పిఆర్ టీం స్టంట్ అని ఆయన అభిప్రాయపడ్డాడు. 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఇదే తంతు నడుస్తోందని, హైప్ కోసం చెప్పే నంబర్స్ అంటూ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. 4 వేల కోట్ల బ్జడెట్‌తో హిందీ 'రామాయణ' తెరకెక్కుతోంది. ఒక్కో పార్ట్‌కు 2000 కోట్లు ఖర్చు పెడుతున్నారు. దాదాపు సగం పైగా బ్జడెట్ విఎఫ్ఎక్స్ కే ఖర్చు పెడుతున్నారట. ఎన్ని కోట్లు పెట్టినా 4000 కోట్ల బడ్జెట్ అనేది నమ్మేలా లేదంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మనోజ్ బాజ్‌పాయ్ చెప్పిన పిఆర్ టీం బ్జడెట్ లెక్కల్లో ఎంత నిజం ఉందో లేదో గానీ, ఈ కామెంట్స్ పెద్ద చర్చకు దారితీశాయి. మనోజ్ నటిస్తున్న 'గవర్నర్' మూవీ 12న రిలీజ్ అవుతోంది. సినిమా వస్తోందన్న సంగతి చాలామందికి తెలియడం లేదు, అందుకే తన సినిమాకు హైప్ తీసుకొచ్చేందుకే ఇలా మాట్లాడాడంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.






# విమర్శలు కూడా సృజనాత్మకతగానే చూడాలి నటి అనసూయా భరద్వాజ్

సినిమా అంటేనే కేవలం కల్పిత కథ అని.. అందులోని తప్పొప్పులు నిర్ణయించుకునే పూర్తి విచక్షణ మనపైనే ఉంటుందని నటి అనసూయ భరద్వాజ్ అన్నారు. సమాజంలో జరిగే విషయాలకు సినిమాలతో ముడిపెట్టొద్దని అన్నారు. చిత్రరంగంపై బాధ్యత, సృజనాత్మక స్వేచ్ఛ గురించి ఆమె సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.'ఒకప్పటి కథలలో నైతికత కనిపించేది. హీరో పాత్రలు స్ఫూర్తిదాయకంగా ఉండేవి. విలన్ పాత్రలు మనం అనుకరించకూడదు అనిపించేలా ఉండేవి. ఈ రోజుల్లో తెరకెక్కే కథల్లో ఈ స్పష్టత లోపిస్తోంది. పాత్రను గొప్పగా చూపించడం కోసం దర్శకులు ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఒక కథను తెరకెక్కిస్తు న్నామంటే.. దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిలో టెక్నికల్ టీమ్ నుంచి దర్శక నిర్మాతలు, నటీనటులు, చివరకు ప్రేక్షకులు కూడా కీలక పాత్రధారులే. అందుకే సినిమా ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉండాలి. సృజనాత్మకత విషయంలో వచ్చిన భేదాభిప్రాయాల వల్ల నేను కొన్ని షోల నుంచి వైదొలిగిన సందర్భాలూ ఉన్నాయి. దానివల్ల నా ప్రతిభకు తగిన అవకాశాలు రావడంలో ఇబ్బందులూ ఎదుర్కొన్నా. అంత కష్టంలోనూ నా సిద్ధాంతాల కోసమే నిలబడ్డాను అని అనసూయ చెప్పారు. సృజనాత్మక స్వేచ్ఛ అనేది చాలా అవసరం. అదే సమయంలో సామాజిక స్పృహ ఉండటం కూడా అంతే ముఖ్యం. సినిమాలు సమాజాన్ని మంచి మార్గంలో ముందుకు నడిపించాలని ఆశించకూడదు. అలాగని సమాజంపై ఎలాంటి ప్రభావం చూపవని కూడా అనుకోకూడదు. సమాజంలో జరిగే ప్రతి విషయానికి సినిమాను నిందించలేం.

# పెద్దికి ఊహించని విజయం దర్శక,నిర్మాతల ఆనందం

'మేం నమ్మిన విషయాన్ని ప్రేక్షకులు నిజం చేశారు. స్ఫూర్తిదాయకమైన 'పెద్ది' సినిమాని తమ పిల్లలతో కలిసి కుటుంబాలు ఆస్వాదిస్తున్నాయి. రానున్న పది రోజుల్లో 'పెద్ది' మరింత పెద్ద విజయంగా నిలుస్తుంది' అన్నారు బుచ్చిబాబు సానా. ఆయన దర్శకత్వంలో... రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'పెద్ది'. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పించాయి. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా బాక్సాఫీస్ ఛాంపియన్ పేరుతో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించింది చిత్రబృందం. దర్శకుడు మాట్లాడుతూ 'చాలా పెద్ద విజయం ఇది. ముందస్తు ప్రదర్శనల నుంచే నా ఫోన్ ఆగకుండా మోగుతోంది. నా తొలి చిత్రం 'ఉప్పెన' కంటే పది రెట్లు మించిన స్పందన వచ్చింది. సినిమా చూసినవాళ్లంతా ఎంతో స్ఫూర్తి పొందామని చెబుతున్నారు. రామ్‌చరణ్ పడిన కష్టాన్ని అందరూ గుర్తించారు. ఆయన లేకపోతే ఈ సినిమా లేదు' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల ఆదరణతో అద్భుతంగా దూసుకుపోతోంది 'పెద్ది' చిత్రం. తొలి రోజే రూ.135 కోట్లకుపైగా వసూళ్లు సాధించింది. రామ్‌చరణ్ కెరీర్‌లోనే అత్యుత్తమైన సినిమాగా నిలుస్తూ, రికార్డ్ స్థాయిలో వసూళ్లు సాధిస్తోంది. నిర్మాత రవిశంకర్ యలమంచిలి మాట్లాడుతూ 'తెలుగులో ఇప్పటివరకూ చూడని ఓ కొత్త రకమైన క్రీడా నేపథ్యంలోని సినిమా ఇది. పిల్లలకు ఎంతగానో ఉపయోగపడే చిత్రం. అందుకే ఇంటిల్లిపాదీ వెళ్లి చూడాలని కోరుతున్నాం. దర్శకుడు బుచ్చిబాబు రాసిన కథ, అద్భుతమైన రామ్‌చరణ్ నటన కారణంగా ఈ సినిమా రికార్డు స్థాయిలో వసూళ్లు సాధిస్తోంది' అన్నారు.



# రాహుల్, గిల్ సెంచరీల మోత..

## భారీ స్కోరు దిశగా భారత్..! అఫ్ఘాన్‌తో భారత్ ఏకైక టెస్టు



అఫ్గానిస్థాన్‌తో శనివారం ప్రారంభమైన ఏకైక టెస్టు తొలి రోజు ఆటలో టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. తొలి రోజు ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 368 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ శతకాలతో కదం తొక్కగా, యువ బ్యాటర్ సాయి సుదర్శన్ (81), రిషభ్ పంత్ (50 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. అఫ్ఘాన్ బౌలర్లలో సలీమ్ సఫీ రెండు వికెట్లు పడగొట్టాడు. అఫ్ఘానిస్థాన్‌తో శనివారం ప్రారంభమైన ఏకైక టెస్టు మ్యాచ్ తొలి రోజు ఆటలో టీమిండియా ఆధిక్యం కనబరిచింది. న్యూచండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. యశస్వి జైశ్వాల్‌తో పాటు కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్ ప్రారంభించాడు. అయితే 32 బంతుల్లో 24 రన్స్ చేసిన తర్వాత జైశ్వాల్.. తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన సాయి సుదర్శన్.. రాహుల్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు.ఆడేది టెస్టు మ్యాచ్ అయినా.. సాయి సుదర్శన్ మాత్రం వేగంగా పరుగులు రాబట్టాడు. హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని.. సెంచరీ దిశగా అడుగులు వేశాడు. మరోవైపు కేఎల్ రాహుల్ కూడా ఈజీగా పరుగులు రాబట్టాడు. దీంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే కేఎల్ రాహుల్ శతకం పూర్తి చేసుకున్నాడు. అయితే అదే స్కోరు వద్ద అతడు క్యాచ్ ఔట్ అయ్యాడు. సాయి సుదర్శన్ 104 బంతుల్లో 81 రన్స్ చేసి పెవిలియన్ చేరిపోయాడు. రాహుల్, సుదర్శన్.. రెండో వికెట్‌కు 139 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లే బాధ్యతను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ , రిషభ్ పంత్ తీసుకున్నారు. ఈ క్రమంలోనే శుభ్‌మన్ గిల్.. తన టెస్ట్ కెరీర్‌లో మరో శతకాన్ని పూర్తి చేశాడు. మరోవైపు రిషభ్ పంత్ కూడా ధాటిగా బ్యాటింగ్ చేసి.. అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్.. 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 368 పరుగులతో నిలిచింది. ప్రస్తుతం క్రీజులో శుభ్‌మన్ గిల్ (143 బంతుల్లో 103 రన్స్), రిషభ్ పంత్ (70 బంతుల్లో 50 రన్స్) ఉన్నారు. అఫ్ఘానిస్థాన్ బౌలర్లలో మహమ్మద్ సలీమ్ సఫీ రెండు వికెట్లు తీశాడు. రెహ్మాన్ షరీఫ్ ఒక వికెట్ పడగొట్టారు. టీమిండియా రెండో రోజు ఆటలో 500 రన్స్ మార్కును చేరుకుని.. ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసే అవకాశం ఉంది.

# సచిన్ రికార్డు బ్రేక్ చేసిన వైభవ్



ఐపీఎల్ 2026లో రికార్డుల మోత మోగించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి తొలిసారి పిలుపు వచ్చింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం ప్రకటించిన భారత జట్టులో అతడికి చోటు దక్కింది. 15 ఏళ్ల 70 రోజుల వయసులోనే ఎంపికై సచిన్ టెండూల్కర్ రికార్డును వైభవ్ బ్రేక్ చేశాడు. ఐపీఎల్‌లో 776 పరుగులు, 72 సిక్సర్లతో ఆరెంజ్ క్యాప్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డులను గెలుచుకుని, సెలక్టర్లు కచ్చితంగా ఎంపిక చేయాల్సిన పరిస్థితిని అతడు కల్పించాడు.15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో రికార్డుల బూజు దులిపిన వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి పిలుపు అందింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో త్వరలో జరగనున్న టీ20 సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ శనివారం జట్లను ప్రకటించింది. ఇందులో వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కింది. తన ప్రదర్శనతో జట్టులో ఎంపిక చేయక తప్పని పరిస్థితిని వైభవ్ కలిగించాడని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. అయితే భారత జట్టు నుంచి తొలిసారి పిలుపు అందుకోవడం ద్వారా.. వైభవ్ సూర్యవంశీ రికార్డు క్రియేట్ చేశాడు.15 ఏళ్ల 70 రోజుల వయసులో వైభవ్‌కు టీమిండియా నుంచి పిలుపు అందింది. గతంలో ఈ రికార్డు టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్.. భారత్ తరఫున 16 ఏళ్ల 205 రోజులు ఉన్నప్పుడు ఎంపికయ్యాడు. తాజాగా ఆ రికార్డును వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు. ప్రపంచ దృష్టిని తనవైపు ఆకర్షించాడు. కాగా ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ పలు భారీ రికార్డులు బ్రేక్ చేశాడు. తన పవర్ బ్యాటింగ్‌తో సత్తాచాటిన అతడు.. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఈ సీజన్‌లో అతడు ఏకంగా 72 సిక్సర్లు బాదాడు. దీంతో ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన గేల్ రికార్డును బ్రేక్ చేశాడు. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్.. 2012 సీజన్‌లో 65 సిక్సర్లు బాదడం గమనార్హం. మరోవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్‌లో ఈ 15 ఏళ్ల చిచ్చర పిడుగు 16 మ్యాచులలో ఆడాడు. అందులో ఏకంగా సుమారు 240 స్ట్రైక్ రేటుతో 776 పరుగులు స్కోరు చేశాడు. దీంతో ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా 436.5 పాయింట్స్‌తో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు సొంతం చేసుకున్నాడు. 72 సిక్సర్లతో సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. 237.31 స్ట్రయిక్ రేట్‌తో సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు కూడా వైభవ్ సూర్యవంశీకే దక్కడం గమనార్హం.



# టెస్టు క్రికెట్ మ్యాచ్ మధ్యలో పింక్ బాల్..

రానున్న రోజుల్లో టెస్టు క్రికెట్‌లో ఐసీసీ కొత్త రూల్‌ని ప్రవేశపెట్టనుంది. కొన్ని కొన్ని సార్లు బ్యాడ్ లైట్ కారణంగా ఆ రోజులో వేయాల్సిన ఓవర్లు ఉన్నా మ్యాచ్‌ని ముందుగానే ముగిస్తుంటాం. ఇకపై ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు పింక్ బాల్‌ని ఉపయోగించేలా ఐసీసీ కొత్త రూల్ తీసుకొస్తోంది. ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సమర్థించాడు. అక్టోబర్ 1 నుంచి ఈ రూల్ అమలులోకి రానుంది.ఐసీసీ తాజాగా క్రికెట్‌లో కొత్త నిబంధన తీసుకొచ్చింది. టెస్టు క్రికెట్‌లో బ్యాడ్ లైట్ కారణంగా ఆటకు అంతరాయం కలిగినప్పుడు పింక్ బాల్‌ను ఉపయోగించాలని అని ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్వాగతించాడు. ఈ కొత్త నిర్ణయం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నట్లు ఐసీసీ పేర్కొంది. ఇటీవల జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో సాధారణ టెస్టు మ్యాచ్‌లలో కూడా పింక్ బాల్‌ను ప్రయోగాత్మకంగా ఉపయోగించేందుకు ఆమోదం లభించింది. మ్యాచ్ ఎప్పటిలాగా రెడ్ బాల్‌తోనే ప్రారంభమవుతుంది.



# రోహిత్ మళ్లీ అద్భుతాలు సృష్టిస్తాడు
# కోచ్ దినేష్ లాడ్ గట్టి కౌంటర్

ఇండియా మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఫామ్, ఫిట్‌నెస్ పై వస్తున్న విమర్శలకు అతడి చిన్ననాటి కోచ్ దినేష్ లాడ్ గట్టి కౌంటర్ ఇచ్చాడు. శుక్రవారం ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో దినేష్ లాడ్ మాట్లాడుతూ, రోహిత్ ఎవరికీ ఏమీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. ఇండియాకు వన్డే వరల్డ్ కప్ గెలిపించాలనే పట్టుదల రోహిత్ ను ఇంకా మోటివేట్ చేస్తోందని అన్నాడు. వన్డే క్రికెట్ లో మూడు డబుల్ సెంచరీలు చేసిన ఏకైక ప్లేయర్ రోహిత్ అని, 2019 వరల్డ్ కప్ లో ఐదు సెంచరీలు చేసిన రికార్డు అతడికి ఉందని గుర్తు చేశాడు. టెస్టులు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్, వన్డేల్లో మాత్రం ఇండియాను ఫైనల్స్ కు చేర్చడానికి తన ఎక్స్ పీరియన్స్ తో హెల్ప్ అవుతాడని చెప్పాడు.రోహిత్ శర్మ రాబోయే ఆరు నెలల్లో తన ఫిట్‌నెస్, బ్యాటింగ్ ఫామ్ ను నిరూపించుకుంటేనే 2027 వన్డే వరల్డ్ కప్ సెలెక్షన్ ప్లాన్స్ లో ఉంటాడని మాజీ సెలెక్టర్ సబా కరీం చేసిన కామెంట్స్ పై దినేష్ లాడ్ మండిపడ్డాడు. ఆరు నెలల టైమ్ అనేది ఒక్క రోహిత్ కే కాదు, టీమ్ లోని ప్రతి ప్లేయర్ కు ఇంపార్టెంట్ అని అన్నాడు. రోహిత్ 2027 వరల్డ్ కప్ కచ్చితంగా ఆడతాడని తనకు 100 పర్సెంట్ గ్యారెంటీ ఉందని స్పష్టం చేశాడు. రోహిత్ ఖాళీగా ఉంటూ లైఫ్ ఎంజాయ్ చేయడం లేదని, ప్రతిరోజూ ప్రాక్టీస్ చేస్తూ తన ఫిట్‌నెస్ పై వర్క్ చేస్తున్నాడని తెలిపాడు. న్యూజిలాండ్ తో జరిగిన వన్డే సిరీస్ లో మూడు ఇన్నింగ్స్ లో 61 రన్స్ మాత్రమే చేయడంతో రోహిత్ పై విమర్శలు పెరిగాయి. అయితే రోహిత్ టెక్నిక్ పరంగా ఎలాంటి ప్రాబ్లం లేదని లాడ్ అన్నాడు. వన్డే క్రికెట్ లో కాసేపు క్రీజులో సెటిల్ అవ్వడం లో అవసరం లేదని అన్నాడు.



# నార్వే చెస్ చాంపియన్‌గా ప్రజ్ఞానంద..

భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద అంతర్జాతీయ చదరంగ వేదికపై సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రతిష్టాత్మక నార్వే చెస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన తొలి భారతీయ ఆటగాడిగా ఆయన రికార్డు సృష్టించారు. ఈ అద్భుత విజయంపై స్పందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా ప్రజ్ఞానందకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజ్ఞానంద సాధించిన ఈ ఘనత భారత చెస్ రంగానికి ఒక గొప్ప మైలురాయి అని, అంతర్జాతీయ స్థాయిలో ఆయన చూపిస్తున్న ప్రతిభ అద్భుతమని ప్రధాని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. నార్వే రాజధాని ఓస్లోలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో సాధించిన విజయం ప్రజ్ఞానంద కెరీర్‌లోనే అత్యుత్తమమైనదిగా నిలిచిపోతుంది. ఈ టోర్నమెంట్‌లో ఒక దశలో వెనుకబడిన చెన్నై యువ సంచలనం ప్రజ్ఞానంద, ద్వితీయార్థంలో అద్భుతంగా పుంజుకుని ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లను ఓడించారు. చివరి రౌండ్‌కు ముందు అమెరికా గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో స్వల్ప పాయింట్ల ఆధిక్యంతో టైటిల్ రేసులో ముందున్నారు. అయితే చివరి క్లాసికల్ గేమ్‌లో వెస్లీ సో డ్రా చేసుకోవడంతో ప్రజ్ఞానందకు సువర్ణావకాశం లభించింది. ఆఖరి పోరులో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను తెల్ల ముక్కలతో ఎదుర్కొన్న ప్రజ్ఞానంద, ఒత్తిడిని అధిగమించి అద్భుతమైన ఆటతీరుతో విజయం సాధించారు. వరుసగా నాలుగో క్లాసికల్ విజయాన్ని నమోదు చేయడం ద్వారా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని నార్వే చెస్ చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్లసన్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్, వెస్లీ సో, అలీరెజా ఫిరౌజ్జా వంటి దిగ్గజాలు బరిలో నిలిచారు. ఇంతటి కఠినమైన పోటీలో ప్రజ్ఞానంద కేవలం ఒకే వారంలో కార్లసన్, గుకేష్, ఫిరౌజ్జా, కీమర్లను క్లాసికల్ గేమ్‌లలో ఓడించడం విశేషం.

Printed, published and edited by Makam Gangadhar H. No. 11-5-565, Bhagyalaxmi Towers, Venkateswara Colony, saroornagar, Ranga Reddy Dist. 500 035. T. GOwened by Makam Gangadhar and Printed at Ratna Graphics, H. No. 2-3-703/7, Tirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500013 T. G.H. No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Rangareddy Dist. 500 035. T. G. Editor & Managing Director : Makam Gangadhar +919393446188, PRGI No.